క్లుప్తంగా

మాదక ద్రవ్యాలు వాడితే భవిష్యత్తు అంధకారం



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : మాదక ద్రవ్యాలు వాడితే భవిష్యత్తు అంధకారం అవుతుందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తన నివాసంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మత్తు నివారణ చర్యల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. యువత సరదా కోసం మత్తు పదార్థాలు, పానీయాలు అలవాటు చేసుకుని జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. సేవాసమితి అధ్యక్షుడు రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్వోత్తంరెడ్డి, నాయకులు బయపురెడ్డి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్, సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీకి సన్మానం



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని సన్మానిస్తున్న నూరుబాషా సంఘం అధ్యక్షుడు, ముస్లింలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని భాకరాపురంలో ఆయన నివాసంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ముస్లింలు మంగళవారం ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ నూరుబాషా సంఘం అధ్యక్షుడిగా రసూల్‌ను నియమించినందుకు వారు ఆయనను సత్కరించారు. రసూల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని నూరుబాషా సంఘీయులు, ముస్లింలు వైఎస్సార్‌సీపీకి అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో ముస్లింలు నూరుల్లా, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు చిన్నప్ప, సర్వోత్తమరెడ్డి, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీనాయక్

పులివెందుల టౌన్ : స్థానిక ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలోని ఎన్.ఎస్.ఎస్ యూనిట్ 1, 2 జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ మానసిక సమస్యలను అధిగమించాలన్నారు. డీఎస్పీ మురళీనాయక్ మాట్లాడుతూ ఆత్మహత్యలను ఎలా అధిగమించాలో వివరించారు. కార్యక్రమంలో సీఐ రమణ, జనవిజ్ఞాన వేదిక కోఆర్డినేటర్ సనావుల్లా, వైస్ ప్రిన్సిపాల్ సుధీర, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్లు శ్రీనిత, శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


సినీనటుడు సుమన్‌కు సన్మానం



సుమన్‌ను సన్మానిస్తున్న సంఘం అధ్యక్షుడు, సభ్యులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న వీఎస్ లక్ష్మి కల్యాణ మండపంలో మంగళవారం ఈడిగ(గౌడ) సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొండయ్య, గౌరవ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్యలు సినీనటుడు సుమన్‌ను ఘనంగా సన్మానించారు. గండికోటలో సినిమా షూటింగ్ కోసం పులివెందులకు వచ్చిన ఆయనకు కడప, పులివెందుల ప్రాంతాల్లోని గౌడ కులస్తుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈడిగ(గౌడ) కులస్తులు ఐకమత్యంతో తమ సమస్యలను పరిష్కరించుకుని సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీరంగనాథుడు



పులివెందుల టౌన్ : మున్సిపాలిటీలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో నూలు పూజ ప్రవిత్రోత్సవాల్లో భాగంగా మూడవ రోజు మంగళవారం శ్రీరంగనాథుడు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. 9రోజుల పాటు నిర్వహించే నూలుపూజలకు భక్తులు పెద్దసంఖ్యలో హజరై స్వామివారిని దర్శించి తరించనున్నారు. భక్తులు వన భోజన కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు.

మల్చింగ్ సాగుతో ఉద్యాన పంటలకు ఊతం

ముద్దనూరు : సాగునీటి వృథాను అరికట్టడం, కలుపునకు అడ్డుకట్ట, ఎరువుల వినియోగం తగ్గించడం, మెరుగైన దిగుబడి తదితర లాభాలు మల్చింగ్ సాగుతో రైతులకు లబ్ధి చేకూరుతోంది. ఉద్యాన పంటల సాగులో మల్చింగ్ సాగు ప్రక్రియను రైతులకు రాయితీతో ఉద్యానశాఖ ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే జిల్లాలో ఈ మల్చింగ్ ప్రక్రియ ఊపందుకుంటోందని ఉద్యాన శాఖాధికారులు తెలిపారు. జిల్లాలో ఉద్యాన పంటలసాగు అధికంగా వుంది. స్వల్పకాలిక పంటల సాగులో తక్కువ పెట్టుబడి పెట్టి అధిక లాభాలను గడించడానికి మల్చింగ్ సాగు రైతులకు ఓ వరమని ఉద్యాన అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కలింగర, దోస, కర్బూజా, టమోటా, మిరప పంటలతో పాటు చీనీ

రైతులకు రాయితీపై పంపిణీ

తోటలలో కూడా మల్చింగ్ ప్రక్రియతో రైతులు సాగుచేస్తున్నారు. భూమిపై పంట సాలు అంతా పలుచని ప్లాస్టిక్‌తో కప్పి, మొక్కలుండే ప్రాంతంలో చిన్న రంధ్రాన్ని ఏర్పాటు చేస్తారు.

మల్చింగ్ ప్రయోజనాలు : పంటలో నీటి వృధాను అరికట్టడం.పంటకు వేసిన ఎరువులు త్వరగా ఆవిరిగాకుండా వుండటం, ఎరువుల వినియోగం తక్కువ, ప్రధానంగా పంటసాగులో కలుపు పెరగకుండా నివారించడం, సాధారణ సాగుతో పోలిస్తే దిగుబడి కూడా అధికం, పంటసాగు వ్యయం తక్కువ. దోస, కలింగర, కర్బూజా, బీర, కాకర, టమోట పంటల సాగుకు బహుళ ప్రయోజనం.



మల్చింగ్ ప్రక్రియలో సాగులో వున్న పంట

మల్చింగ్‌తో 4 పంటలు సాగుచేస్తున్నా



కళింగర, బొప్పాయి, మిరప, టమోట పంటలను ప్లాస్టిక్ మల్చింగ్ ద్వారా సాగుచేస్తున్నాను. మామూలు సాగుతో పోలిస్తే ముఖ్యంగా కలుపు పెరగడం, తొలగించడం సమస్యలేదు. నీటి వినియోగం కూడా తక్కువే. రాయితీతో అందించే ఈ సాగు ప్రయోజనకరంగా వుంటుంది.

– ప్రభాకర్‌రెడ్డి, ఉద్యాన రైతు,గంగాదేవిపల్లె

ఉద్యాన రైతులకు ప్రోత్సాహం



1 హెక్టారుకు రూ.16వేలు రాయితీ అందిస్తున్నాము. ప్లాస్టిక్ మల్చింగ్‌కు 1 హెక్టారుకు సుమారు రూ.32వేలు వ్యయం అవుతుంది. ఈ సాగులో బహుళ ప్రయోజనాలు వుండటంతో ఉద్యాన రైతులను ప్రోత్సహిస్తున్నాము. ఉద్యాన రైతులంతా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని లబ్ధి పొందాలి.

– మల్లేశ్వరరెడ్డి.డివిజనల్ ఉద్యానశాఖ అధికారి, ముద్దనూరు

రాష్ట్రస్థాయి పోటీలకు ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినులు



వల్లూరు : స్థానిక ఏపీ మోడల్ స్కూల్ కమ్ జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 జిల్లాస్థాయి పోటీల్లో భాగంగా మంగళవారం పులివెందులలో బాలికల విభాగంలో నిర్వహించిన ఖోఖో పోటీల్లో వల్లూరు ఏపీ మోడల్ స్కూల్, కమ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ చూపారు. కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న డీ మమత, ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ చదువుతున్న ఎస్.ముబీనా ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయురాలు సుశీల అభినందించారు.

ఉలవలపల్లెలో లడ్డూ వేలంపాట రూ.50 వేలు



ఉలవలపల్లెలో లడ్డూ వేలం పాటలో రూ.50వేలకు దక్కించుకున్న భక్తుడు కదిరి రమణారెడ్డి

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండలం కొండూరు గ్రామ పంచాయితీలోని ఉలవలపల్లె గ్రామంలో మంగళవారం గ్రామ కమిటి ఆధ్వర్యంలో వినాయక విగ్రహం వద్ద లడ్డూ వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో కదిరి రమణారెడ్డి రూ.50వేలకు లడ్డూ దక్కించుకున్నాడు. అనంతరం గ్రామంలో గణనాధుని ఊరేగింపు నిర్వహించి సమీపంలోని కాల్వలో నిమజ్జనం చేశారు.

రూ.26 వేలకు పలికిన వినాయకుని లడ్డు

పులివెందుల టౌన్ : బైపాస్ రోడ్డులోని చవ్వా సుభాకర్‌రెడ్డి కాలనీలో కొలువుతీరిన గణేశుడుకి మూడు రోజులపాటు పూజలు నిర్వహించారు. వివిధ రకాల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, జమ్మలమడుగు శ్రీవాసవి కోలాట బృందం కోలాటం నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జరిగిన లడ్డు వేలంలో జలీల్ ఈశ్వర్ రూ.26 వేలకు లడ్డును వేలంలో దక్కించుకున్నారు. అనంతరం నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు.

జమ్మలమడుగు : మండల పరిధిలో మొత్తం 70 విగ్రహాలను పెట్టగా.. మంగళవారం నిమజ్జనం 20 విగ్రహాలను పెద్దముడియం కుందూ నదిలో నిమజ్జనం చేశారు.



పులివెందులలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పాతమార్కెట్ వైఎస్ జయమ్మ కాంప్లెక్స్‌లో మట్టి మహాగణపతిని అందంగా తీర్చిదిద్దారు. వారం రోజుల పాటు శ్రమించి మట్టి మహాగణపతిని అందంగా రూపుదిద్దారు. ప్రతి ఒక్కరు మట్టిగణపతిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆకాంక్షించారు. 5 రోజుల పాటు విశేష పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమం చేపడతామన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



హోమ కేశవ

చింతకొమ్మదిన్నె : అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎల్రక్టానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో సహాయ అధ్యాపకుడిగా పనిచేస్తున్న హోమ కేశవకు తమిళనాడులోని వేలూరు విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్‌ను ప్రధానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వేలూరు విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ జీకే రజిని పర్యవేక్షణలో ఎస్‌హెడ్‌డీ డీప్ లెర్నింగ్ మెదడాలసిస్ ఫర్ థ్రీ సైడ్ డిటెక్షన్ అండ్ క్లాసిఫికేషన్ ఆఫ్ బ్రెయిన్ ట్యూమర్ అనే అంశంపై చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డి అభినందించారు.

రేపు ఉపాధ్యాయుల సమావేశం

కమలాపురం : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులకు గురువారం ఉదయం 10 గంటలకు పెద్దచెప్పలి జడ్పీ హైస్కూల్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల క్రీడల కోఆర్డినేటర్ ఎల్‌ఏ సునీల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, షెటిల్, బ్యాడ్మింటన్, ఖో–ఖో, చెస్, యోగ తదితర క్రీడాంశాలపై చర్చించేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అన్ని పాఠశాలల పీఈటీలు, పీడీలు ఈ విషయాన్ని గమనించి సమావేశానికి హాజరుకావాలని ఆయన తెలిపారు.

విజయవాడ వరదకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

- ముందుగా అప్రమత్తం చేసి ఉంటే ఇంత నష్టం జరిగేది కాదు
- వాతావరణ శాఖ హెచ్చరికలను సైతం ప్రభుత్వం పట్టించుకోలేదు
- బాధితులు రోగాలు బారిన పడకుండా ఇప్పటికైన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి
- మృతుల కుటుంబాలకు ఎవరు బాధ్యత వహస్తారు.?
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి



ఎర్రగుంట్ల/జమ్మలమడుగు : విజయవాడ వరదలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి విమర్శించారు. విజయవాడ వరదలు, ఆపై ప్రాణనష్టంపై మంగళవారం ఆయన సాక్షితో మాట్లాడారు. భారీ వర్షాలు, వరదలు వస్తాయని వారం రోజుల ముందే తెలిసినా ప్రజలను ఎందుకు అప్రమత్తం చేయలేదని, కనీసం సురక్షిత ప్రాంతాలకు ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. చంద్రబాబు ఇల్లు వరద నీటలో మునగకుండా ఉండేందుకు చేసిన ప్రయత్నం కారణంగానే విజయవాడలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు వరద ధాటికి సర్వస్వం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వరదల్లో చిక్కు కున్న వారికి కనీసం తాగునీరు కూడా సక్రమంగా అందించలేకపోవడం సిగ్గుచేటన్నా రు. చాలా మంది మృత్యువాత పడ్డారని, అనేక మంది రోగులు మందులు అందక తీవ్ర ఇబ్బందులు పడినా ప్రభు త్వం పట్టించుకోలేదన్నారు.

వరద బాధితులకు సహాయక చర్యలు చేపట్టడంలో విఫలమైన ప్రభు త్వం తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి సాయంపై ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నాయకులపైన ఎదురుదాడికి దిగుతున్నారన్నారు. వరదలు వచ్చిన తర్వాత మరో ముప్పు ప్రజలు రోగాలు బారిన పడే అవకాశం ఉందన్నారు. ప్రజలు రోగాలు బారిన పడుకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికై నా ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్దుకోవాలని హితవు పలికారు.

వర్మీ కంపోస్టు వలన ప్రయోజనాలు

వల్లూరు : వర్మీ కంపోస్టును పంటలకు వాడటం వలన అనేక ప్రయోజనాలువున్నాయని శాస్త్రవేత్త డాక్టర్ కే సాయిమహేశ్వరి తెలిపారు. చిన్ననాగిరెడ్డిపల్లెలోని రైతులకు స్థానిక ఆలయంలో మంగళవారం రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వర్మీ కంపోస్టు ఎరువు తయారీకి కావలసిన పదార్థాలు, పరికరాలను గురించి తెలిపారు. వర్మీ కంపోస్టు తయారీ విధానంతో పాటు తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. దాన్ని వాడటం వలన ప్రయోజనాలను గురించి వివరించారు. వానపాముల ఎరువు తయారీ ద్వారా వ్యాపార అభివృద్ధి గురించి, మార్కెటింగ్ విధానం గురించి వివరించారు. రైతులతో పాటు యువత వర్మీ కంపోస్టు తయారీలో అవగాహన పెంచుకుని ప్రయోజనాలను పొందాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.మానస, మహిళా రైతులు, పలువురు యువకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త కే సాయిమహేశ్వరి

ఇ-క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలి

వల్లూరు : ఖరీఫ్‌లో పంట సాగు చేసిన రైతులందరూ తప్పని సరిగా ఇ-క్రాప్ నమోదుతో పాటు ఇ-కేవైసీ చేయించుకోవాలని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. తోల్లగంగనపల్లె రైతు సేవా కేంద్రంలో జరుగుతున్న ఇ-పంట, ఇ-కేవైసీ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలంలో ఇప్పటి వరకు 1628 మంది రైతులు 4769 ఎకరాల్లో వరి, మినుము, పత్తి మొదలైన పంటలు సాగు చేశారన్నారు. ఇందులో 832 మంది రైతులు ఇప్పటికే ఇ-కేవైసీ కూడా చేయించుకున్నారన్నారు. పంట సాగు చేసి ఇప్పటి వరకు ఇ-క్రాప్ నమోదు చేయించుకోని రైతులు వెంటనే తమ పరిధిలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి అగ్రికల్చర్ అసిస్టెంటును కలిసి ఇ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాక అధికారిణి సాయిజ్యోతి, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఇంద్రజ, రైతులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం తనిఖీ

వల్లూరు (చెన్నూరు) : జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు చెన్నూరు–3 రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇ-పంట, ఇ-కేవైసీ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఇ-కేవైసీకి సెప్టెంబర్ 15 చివరి తేదీగా ఉండటంతో ఆలోపు పూర్తి చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన వరి, బంతి (చెండుమల్లి) పొలాలను పరిశీలించారు. వరిలో సూడోమనస్ లీటరు నీటికి పది గ్రాములు పిచికారి చేయడం వలన పాము పొడ, అగ్గి తెగులు రాకుండా కాపాడుకోవచ్చునన్నారు. బంతి వేసిన పొలం సందర్శించి ట్రైకోడెర్మా పశువుల ఎరువులతో అభివృద్ధి చేయడం వల్ల పూలు నాణ్యత మరియు సైజు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో చెన్నూరు మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి, రైతులు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

జీవామృతంపై అవగాహన సదస్సు

చెన్నూరు మండలం బయనపల్లెలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు పుల్లయ్య పొలాన్ని మండల వ్యవసాయ అధికారిణి శ్రీదేవి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్‌వీ ప్రవీణ్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ విభాగం, వ్యవసాయ శాఖ అధికారులు సందర్శించారు. పసుపులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులకు వివరించి చీడపీడలు తట్టుకునే ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వాడే విధానాలపై సూచనలు ఇచ్చారు. పసుపు పంటలో ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వాడుకను రైతులకు తెలియజేశారు. జీవామృతం తయారీ విధానాన్ని తెలియజేశారు. ఈ వర్షాభావ పరిస్థితులకు తెగులు సోకే అవకాశం ఉన్నందున జీవామృతం, పుల్లటి మజ్జిగ వాడకాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు చరణ్‌రెడ్డి, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యుల ఆందోళన



నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తున్న వైద్యులు

వేంపల్లి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు జీవో నెంబర్ 85ను వ్యతిరేకిస్తూ ఆందోళన బాట పట్టారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపుమేరకు వైద్యులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి తమ విధులను నిర్వహిస్తున్నారు. తాళ్లపల్లె, చక్రాయపేట, వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు స్వాతి సాయి, పృథ్వి, లక్ష్మిప్రియా, నిజాముద్దీన్, స్వర్ణలత, శరణ్య తదితరులు నల్ల బ్యాడ్జీలు ధరించి రోగులకు వైద్యం చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 85 ద్వారా తమ మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోయిందన్నారు. ఇలా అకస్మాత్తుగా జీవోను మార్చడం అన్యాయమన్నారు. గత రెండు నెలలుగా జీవో నెంబర్ 85ను రద్దు చేయాలని అన్ని అధికారులకు, శాసనసభ్యులకు అర్జీలు సమర్పించినప్పటికీ ఇంతవరకు ఎటువంటి సమాధానం రాలేదని వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్ 19 సమయంలో తమ జీవితాలను పణంగాపెట్టి సేవలు అందించినప్పటికీ ఇప్పుడు జీవో నెంబర్ ద్వారా పీజీ అవకాశాలు తగ్గించడం అన్యాయమన్నారు. ఇది గ్రామీణ ప్రాంతాల్లో ప్రభావితం చేస్తుందని తెలిపారు.

రికార్డులు కచ్చితంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

జమ్మలమడుగు : పట్టణంలో తిరుగుతున్న ఆటో డ్రైవర్లు కచ్చితంగా రికార్డులతోపాటు, ఇన్సూరెన్సులు కలిగి ఉండాలని అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆటోయూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. వాహనాలను నడుపుతున్నప్పుడు టేప్ రికార్డుల సౌండ్ ఉండకూడదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కల్పన తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు సురక్షితం

కమలాపురం : ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు సురక్షితంగా చేస్తామని, గర్భిణులందరూ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేసుకోవాలని పెద్దచెప్పలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ జావలి ప్రసూన తెలిపారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించిన ప్రధాన మంత్రి మాతృత్వ అభియాన్ సురక్షిత కార్యక్రమంలో ఆమె గర్భిణీలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి గర్భిణీ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు చేసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు సురక్షితంగా చేస్తారన్నారు. గర్భందాల్చే సమయంలోని 12 వారాల గురించి ఆమె వివరించారు. ల్యాబ్‌లో అందించే సేవలు, 108, 104 అందించే సేవల గురించి అవగాహన కల్పించారు. అలాగే హైరిస్క్ గర్భిణులను గుర్తించాలని, మాతా శిశు మరణాలను అరి కట్టేందుకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, వైరల్ ఫీవర్స్ తదితర రోగాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రక్తహీనత ఉన్నా, హైరిస్క్ ఉన్న గర్భిణుల గురించి తక్షణం తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

నివాళి

పులివెందుల టౌన్ : పట్టణంలోని ఎంఆర్‌ఎఫ్ టైర్స్ షోరూమ్ యజమాని కుప్పాల వెంకటసుబ్బరాయుడు అనారోగ్యంతో మృతి చెందారు. గతంలో మాజీ పులివెందుల పంచాయతీ మేంబరు, యారో కిడ్స్ చైర్మన్ అయిన ఆయన హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటూ సోమవారం మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మంగళవారం ఆయన భౌతిక కాయానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి

వేంపల్లె : గర్భిణులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు స్వాతి సాయి తెలిపారు. మంగళవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వం అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. గర్భిణులు ప్రతినెల 9, 10వ తేదీన నాలుగు నెలల నుంచి 9వ నెల వరకు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఏమైనా ప్రమాద సంకేతాలు ఉన్నవారు చికిత్స చేయించుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు 102 లేదా 108 వాహనాలను ఉపయోగించుకుని సరైన సమయంలో ఆసుపత్రికి చేరుకుని చికిత్స చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు చేయించుకుంటే ప్రభుత్వం నుంచి వివిధ రకాల బెనిఫిట్స్ పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ వెంకటలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న స్వాతిసాయి

వేముల : మహిళలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా తెలిపారు. మండలంలోని చాగలేరు అంగన్‌వాడీ–2 కేంద్రంలో మంగళవారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలలో, తల్లులలో, కిషోర బాలికల్లో రక్తహీనత రాకుండా పోషకాహారం ఉన్న పదార్థాలను తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ప్రతీరోజు తాజా ఆకుకూరలు, కాయగూరలు, నిమ్మజాతి పండ్లు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రక్తహీనత ఉన్నవారు కాఫీ, టీ వంటి ద్రవపదార్థాలను తీసుకోకూడదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా, మహిళలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

పులివెందుల రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న పోషకాల మాసోత్సవాలను విజయవంతం చేయాలని సీడీపీఓ శ్రీలత తెలిపారు. మండలంలోని నల్లపురెడ్డిపల్లెలోని ఎర్రబల్లె–1, 2 సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనతను నివారించవచ్చన్నారు. కూరగాయలు, ఆకుకూరలు, గుడ్లు, మాంసాహారం, బెల్లం, ఖర్జూరం వంటి వాటిని ప్రతీరోజు ఆహారంలో తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాలను తీసుకుని ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలన్నారు.